హైదరాబాద్ వార్త

ఆకట్టుకుంటున్న 'వింగ్స్ ఇండియా షో'

-కనువిందు చేసిన వైమానిక విన్యాసాలు -ప్రత్యేక ఆకర్షణగా డ్రోన్ షో

బేగంపేట జనవరి 28,ప్రభాతవార్త

బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా 2026 ఉత్సాహంగా ప్రారభమైంది.ఈ ప్రదర్శనను కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో వివిధ దేశాలకు చెందిన అత్యాధునికమైన విమానాలు, హెలికాప్టర్లు, కొలువుదీరాయి.ప్రతి రెండేళ్లకొకసారి నిర్వహించే ఈ ప్రదర్శన ఈ ఏడాది మరింత విభిన్నంగా ప్రారంభమైంది. స్టాటిక్ ప్రదర్శనలో ఉంచిన విమానాల్లో ప్రధానంగా ఎయిర్ ఇండియా 787 ,స్టార్ ఎయిర్ ఈ 175, హున్ను ఎయిర్ వింగ్స్ ఆఫ్ మంగోలియా,ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ 737,ఇండిగో ఏ 321,ఎయిర్ బాల్టిక్ (ఎయిర్‌బస్ ఏ220) యూఏసీఎల్ 114,రీజినల్ టర్బోప్రోప్,ఆకాష్ ఎయిర్ 737,హెచ్ ఏఎల్ కు చెందిన యూఏసీ ఎస్‌బీజే ,హెచ్ఎల్ ఎస్ జే 100 వంటి మొత్తం చిన్నా పెద్దా కలిపి 27విమానాలు ,హెలికాప్టర్లు బేగంపేట విమానాశ్రయంలో ప్రదర్శనకు వచ్చాయి.

అబ్బుర పర్చిన వైమానికి విన్యాసాలు...

ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన సూర్య కిరణ్ బృందం తో పాటు మార్క్‌జాఫ్రీస్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన వైమానిక విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆయా బృందాలు గాలిలో వివిధ రంగుల పొగలు చిమ్ముకుంటూ ఆకృతులను ఆవిష్కరించిన తీరు సందర్శకులను ఎంతో ఆకట్టుకున్నాయి.

మెదటి రోజు ప్రదర్శనకు సందర్శకులు భాగా తరలివచ్చారు. ప్రాంగణంలోకి అడుగిడిన సందర్శకులు తమకు నచ్చిన విమానాలు,హెలికాప్టర్లు,విమాన విడిభాగాలు ఇలా వారికి నచ్చిన చోట సెల్ఫీలు దిగుతూ సందడి చేసారు. భారీ విమానాలను చూసేందు కు అనుమతించడంతో వారు విమానాలను ఎక్కి వాటి గురించి ఆరా తీసారు. ఇంకాఎక్కువ మంది తమకు నచ్చిన ప్రాంతాల్లో సెల్ఫీలు, పోటోలు దిగుతూ సందడి చేసారు.

నగరంలో పారిశుధ్య వ్యవస్థ మరింత బలోపేతం

-వ్యర్థాల నిర్వహణ నిబంధనలు కఠినంగా అమలు

-జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ రఘుప్రసాద్

కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రఘుప్రసాద్, ఎస్ఈ గోపాల్ తదితరులు

హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:

స్వచ్ఛ భారత్ మిషన్ -అర్బన్ (2.0)లో భాగంగా జిహెచ్ఎంసీ బుధవారం నూతనంగా నియమితులైన సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లకు ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శానిటేషన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించింది. ఈసందర్భంగా ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు - 2024, వాటిలో జరిగిన తాజా సవరణలు, అలాగే ఫీల్డ్ స్థాయిలో అమలులో ఎదురయ్యే ఆపరేషనల్ సవాళ్లపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రఘు ప్రసాద్ మాట్లాడుతూ నగర పారిశుధ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం, వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలులో కఠినంగా వ్యవహరించడం ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగర పనితీరును మెరుగుపరచవచ్చు అన్నారు. ఎస్ఎండబ్ల్యూ సూపరింటెండింగ్ ఇంజినీర్ గోపాల్ మాట్లాడుతూ నూతనంగా చేరిన ఇంజినీర్లు ఫీల్డ్ స్థాయిలో చురుకైన పాత్ర పోషిస్తూ, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈసందర్భంగా టూల్‌కిట్, ఘన వ్యర్థాల నిర్వహణ విధానాలు, నిర్మాణ కూల్చివేత (సీఅండ్‌డీ), అలాగే బల్క్ గార్బేజ్ జనరేటర్ల నిబంధనల అమలు వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.ఫీల్డ్ స్థాయిలో అవగాహన కార్యక్రమాల కోసం అవసరమైన ఐఈసీ మెటీరియల్‌ను కూడా స్వచ్ఛ భారత్ మిషన్ బాధ్యులు ఇంజినీర్లకు అందజేశారు.

ఫైర్ సేఫ్టీపై హైడ్రా నజర్..

-వ్యాపార సముదాయాల్లో తనిఖీలకు కమిషనర్ ఆదేశం

-నింబంధనలు ఉల్లంఘిస్తే కరెంట్ కట్, షాప్‌లు సీజ్

-అగ్నిప్రమాదం పొంచి ఉన్న లొకేషన్, వీడియోలు పంపాలని ప్రజలకు విన్నపం

-సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడి

-ఫిర్యాదుల కొరకు కంట్రోల్‌రూం నెంబర్ -9000113667

హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:

ఫైర్ సేఫ్టీపై హైడ్రా దృష్టి పెట్టింది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటోంది. వ్యాపార సముదాయాల నుంచి నివాస ప్రాంతాల వరకూ ఫైర్ సేఫ్టీలో ఎక్కడా అలసత్వాన్ని ఉపేక్షంచరాదని హైడ్రా నిర్ణయించింది. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకునేందుకు నడుం బిగించింది. జీహెచ్ఎంసీ, ఫైర్, విద్యుత్ విభాగాల అధికారులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం సమావేశమయ్యారు. ఫైర్ సేఫ్టీ కార్యాచరణ వివరించారు. వ్యాపార సముదాయాలు, ఫర్నీచర్, వస్త్ర దుకాణాలు ఇలా అన్ని చోట్లా తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఫైర్ సేఫ్టీ పాటించకపోతే.. ఆయా షాపులను సీజ్ చేయాలని నిర్ణయించారు. వెనువెంటనే విద్యుత్ సరఫరా బంద్ చేయాలని ఫైర్ సేఫ్టీ లేని వ్యాపార సముదాయంగా షాపుగా పేర్కొంటూ నోటీసులు అతికి పెట్టాలని అధికారులకు సూచించారు. నగర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేయాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు.

9000113667 నంబరుకు సమాచారమివ్వండి..

అగ్ని ప్రమాదానికి ఆస్కారం ఉన్న పరిస్థితులుంటే వెంటనే హైడ్రా కంట్రోల్ రూం నంబరు 9000113667 కు ఫోను చేసి సమాచార మివ్వాలని హైడ్రా కమిషనర్ నగర ప్రజలను కోరారు. ఎక్కడ అగ్ని ప్రమాదానికి అవకాశం ఉన్న పరిస్థితులున్నాయో లొకేషన్‌తో పాటు.. వీడియోలు, ఫొటోలు పంపించాలని సూచించారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. నగరం లోని అందరి లక్ష్యం అగ్ని ప్రమాదాలు తగ్గించడమే కావాలని కోరా రు. గతేడాది నగరంలో జరిగిన అగ్ని ప్రమాదాలు 36కు పైగా ఉన్నాయని నెలకు 3 చొప్పున ఘటనలు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు.

జిహెచ్ఎంసి,విద్యుత్, ఫైర్ విభాగాలతో సమావేశమైన హైడ్రా కమిషనర్ రంగనాథ్

జాగ్రత్తలు తప్పనిసరి ..

నాంపల్లిలో జరిగిన ఫర్నీచర్ దుకాణం సెల్లార్‌లలో లెక్కకు మించిన ఫర్నీచర్‌ను నెట్టులుగా పెట్టారు. సెల్లార్లోనే వాచ్‌మ్యాన్‌కు నివాసం కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు షాపులో ఉన్న వారు బయటపడినా.. సెల్లార్‌లో ఉన్న వారు మంటల్లో చిక్కుకున్నారు. ఇందులో కాపాడేందుకు వెళ్లిన ముగ్గురు వ్యక్తులు కూడా ఉన్నారు. వస్త్ర దుకాణదారులు, ఫర్నీచర్ షాపులతో పాటు ఇతర వ్యాపారాలు చేసిన వారు.. వారి నిలువలను మెట్ల మార్గంలో, కారిడార్‌లో, సెల్లార్లలో నిలువ ఉంచరాదు. ఇందుకు ప్రత్యేకంగా జన సంచారం లేని ప్రాంతాల్లో గోదాముల్లో నిలువ ఉంచుకోవాలి. సెల్లార్‌లు వాహనాల పార్కింగ్ కోసమే వినియోగించాలి. పేలుడు, మండే స్వభావం ఉన్న వస్తువులు, పదార్థాలు నిల్వ ఉంచరాదు. వ్యాపార సముదాయాల్లో నివాసాలు ఏర్పాటు చేయరాదు. అలాగే సెల్లార్లలో వర్క్ర్లు, వాచ్ మ్యాన్ కుటుంబాలకు గదులు కేటాయించడం చేయరాదు. సెల్లార్ నుంచి టెర్రాస్ వరకూ మెట్ల మార్గాలను ఎట్టి పరిస్థితులలో బ్లాక్, లాక్ చేయరాదు. .. షాపులు, వ్యాపార సముదాయాల్లో ఉన్న అగ్ని నియంత్రణ పరికరాలు ఎల్లవేళలా పని చేసే విధంగా ఉంచుతూ, సిబ్బందికి అగ్ని పరికరాలపై తగిన అవగాహన కల్పించాలి. ఒక వేళ షార్టు సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగినా దుకాణాల్లో ఉన్న వారు క్షణాల్లో బయట పడేందుకు వీలుగా దారులు చూపించాలి. అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే మానవ ప్రమేయం లేకుండా మంటలను ఆర్పేందుకు ఉద్దేశించిన స్ప్రింక్లర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.

తులం బంగారం కోసం లబ్దిదారులు ఎదురు చూస్తున్నారు

-కళ్యాణలక్ష్మీ,షాదీముబారక్ లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తలసాని

బేగంపేట జనవరి 28,ప్రభాతవార్త

కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న తులం బంగారం కోసం కళ్యాణ లక్ష్మీ,షాదీముబారక్ లబ్దిదారులు ఎదురు చూస్తున్నారని,మాజీ మంత్రి,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లోని తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సికింద్రాబాద్, ఖైరతాబాద్,అమీర్‌పేట తహశీల్దార్ కార్యాలయాల పరిధిలోని 70మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ,షాదీముబారక్ ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద,మధ్య తరగతి కుటుంబాలు ఆడబిడ్డ పెండ్లికి ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆనాటి తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక లక్ష 116లు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే కళ్యాణ లక్ష్మీ,షాదీముబారక్ లబ్దిదారులకు అదనంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, రెండేళ్లు అవుతున్నా నేటి వరకు ఒక్కరికీ కూడా ఇవ్వలేదని విమర్శించారు.కేవలం అధికారంలోకి రావడానికి ఆచరణ సాధ్యం హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు.ఇప్పటికైనా తులం బంగారం హామీని నెరవేర్చాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు టి.మహేశ్వరి,కుర్మ హేమలత,మాజీ కార్పోరేటర్ నామన శేషుకుమారి,సికింద్రాబాద్ తహశీల్దార్ పాండునాయక్,డివిజన్ బీఆర్ఎస్ నాయకులు టి. శ్రీహరి,ఆకుల హరికృష్ణ,హన్మంతరావు,వెంకటేషన్‌రాజు,నరేందర్,లక్ష్మీపతి,కొండాపురం మహేష్ యాదవ్.ఏసూరి మహేష్,అశోక్ యాదవ్,ఆరీఫ్,శ్రీకాంత్‌రెడ్డి కుమార్ యాదవ్,వనం శ్రీనివాస్,సతీష్ పాల్గొన్నారు.

లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని.

ఫిబ్రవరి 2నుంచి సిఎంకప్ రెండో ఎడిషన్

-మండల,నియోజకవర్గం, జిల్లా స్థాయిలో నిర్వహణ

-జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి

హైదరాబాద్,జనవరి 28,ప్రభాతవార్త: సీఎం కప్ సెకండ్ ఎడిషన్ మళ్లీ షురూ కానుంది. మండల స్థాయి పోటీలు ఫిబ్రవరి 2 ,3 తేదీలలో నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఇ.వెంకటాచారి తెలిపారు. ఈమేరకు బుధవారం సెకండ్ ఎడిషన్ సీఎం కప్-2025 నిర్వహణకు సంబంధించి జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.దీనికి జిహెచ్ఎంసి, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్ జిల్లాలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సీఎం కప్-2025 నిర్వహణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించి వివిధ అధికారుల అధ్యక్షతన జిల్లా, నియోజకవర్గ,మండల, స్థాయికమిటీలు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. పిల్లలు ఎక్కువగా క్రీడల్లో పాల్గొనే విధంగా రిజిస్ట్రేషన్ సంఖ్యను పెంచేలా ప్రత్యేక కృషి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అలాగే మైదానాలలో షామీయా నాలు, త్రాగునీరు, మెడికల్ శిబిరాలు తప్పక ఉండాలని సూచించారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (క్రీడలు) మంగతాయారు మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్లే ఈ కార్యక్రమంలో అత్యంత కీలకమైన అంశం అని గేమ్స్ కోచ్‌లు, జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్లు మరియు ఫీల్డ్ స్థాయి సిబ్బంది అందరూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు గరిష్టంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగరవ్యాప్తంగా ఉన్న జీహెచ్ఎంసీ మైదానాలు, క్రీడా సముదాయాల గుర్తింపు, అందుబాటులో ఉన్న వసతుల వినియోగం, పరికరాల అందచేతపై ఆమె వివరించారు.జిల్లా యువజన మరియు క్రీడల అధికారి సుధాకర్ మాట్లాడుతూ మండల మరియు జిల్లా స్థాయిల్లో ఫెడరేషన్ నిబంధనలు, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పోటీలు క్రమబద్ధంగా, కాలపరిమితిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈకప్‌లో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, యోగా, క్యారమ్, చెస్, కరాటే, బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, హ్యాండ్‌బాల్, జూడో, కిక్‌బాక్సింగ్, నెట్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్, వూషూ, బాల్ బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్కేటింగ్, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, పారా గేమ్స్ పిల్లల కోసం వినోదాత్మక క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి పవన్, ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరులు అన్ని మండలాల తహసీల్దార్లు, ఫిజికల్ డైరెక్టర్లు, పిఈటిలు, కోచ్‌లు, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్లు, క్రీడా సంఘాలు, ఒలింపిక్ అసోసియేషన్లు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌వో వెంకటాచారి, జిహెచ్ఎంసి స్పోర్ట్స్ మంగతాయారు, జిల్లా స్పోర్ట్ అధికారి సుధాకర్‌రావు తదితరులు

కుల్సుంపురాలో విగ్రహాల వ్యర్థాల నిల్వతో అగ్నిప్రమాదం

మంటలు అంటుకుని దగ్ధమైన వ్యర్థపదార్థాలు

జియాగూడ,జనవరి 28ప్రభాతవార్త:

ప్రమాదవశాత్తు మంటలంటుకుని మూసి నది సమీపంలో ప్రాంతంలో వ్యర్థపదార్థాలను మూలంగా బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది.ఈసంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఇన్‌స్పెక్టర్ రాములు కథనం ప్రకారం..మూసినది సమీపంలో వ్యర్థాలను నిల్వ చేసిన గోదాంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుందన్నారు, స్థానిక సమాచారం మేరకు అగ్నిమాపక దళం,పోలీసులు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.గోదాంలో ప్రక్కనే జరుగతున్న వెల్డింగ్ పనుల విషయంలో వచ్చిన మంటలమూలంగా మంటలు అంటుకుని ఉండవచ్చునని పోలీసులు అనుమానించారు.అగ్నిప్రమాదం మూలంగా ఎలాంటి ఆస్దినష్టం,ప్రాణ నష్టం సంభవించలేదన్నారు.ఈ కేసును కుల్సుంపురా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

-ఇరువర్గాలపై కేసు నమోదు....

కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో స్వల్ప వివాదం వెలుగులోకి వచ్చింది.పోలీసులు ఓ వర్గానికిచెందిన వ్యక్తిపై,మరో వ్యక్తులపై విడియో తీస్తున్నారని అనుమానంతో రెచ్చిపోయి మరో వర్గానికిచెందిన వ్యక్తిపై దాడికి దిగినట్లు చెప్పారు.వీడియో తీసినట్లు అనుమానంతో సదరు వ్యక్తి ఇంట్లోచొరబడి దాడి చేసినట్లు మరో వర్గానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేయడంతో పోలీసులు దాడి చేసినవ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కుతరలించినట్లు చెప్పారు.సదరు ఇన్‌స్పెక్టర్ రాములు దాడి కొట్టినట్లు బాధితుడి చెప్పడంతో పోలీసులు వెళ్లి అదుపులోకి తీసుకున్నామని కొట్టలేదని సిఐ రాములు తెలిపారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.ఈ కేసు కుల్సుంపురా పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు.వామో కల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏమి జరిగిన సంచలనంగా మారుతుంది.గత రెండు నెలల క్రితం ఒక సిఐ,ఎసిపి సస్పెండ్ అయిన విషయం విధితమే

రాజేంద్రనగర్‌లో సమ్మక్క-సారక్క జాతర ఉత్సవాలు

అత్తాపూర్ జనవరి28,ప్రభాతవార్త :

మేడారం జాతర తరహాలో రాజేంద్రనగర్‌లో నిర్వహించే సమ్మక్క -సారక్క జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.మేడారం జాతర తరహాలోనే ఇక్క కూడా వనదేవతలను కొలుస్తూ భక్తులు మొక్కలు చెల్లించుకుంటారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వాహించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేలను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాజేంద్రనగర్ లో కూడా వనదేవతలను కొలుస్తూ భక్తులు మొక్కలు చెల్లించుకుంటారని మేడారానికి వెళ్లలేని నగరవాసులు రాజేంద్రనగర్ ప్రాంతంలో జరిగే ఈ జాతరలో పాల్గొంటారని ఇలాంటి జాతర తన ప్రాంతాల్లో జరగడం సంతోషకర విషయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నిర్వహకులు ఇతర పార్టీల నేతలు,భక్తులు పాల్గొన్నారు.

బస్సులు కొరతతో ప్రయాణీకుల ఇబ్బందులు

ఆర్టీసి బస్సులు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణీకులు

చార్మినార్,జనవరి 28 ప్రభాతవార్త :

సమ్మక్క సారాలమ్మ మేడారం మహా జాతరకు నగరంలోని ఆర్టీసీ బస్సులు వెళ్లటంతో నగరంలో బస్సుల కొరత ఏర్పడింది.బస్సులు తక్కువగా నడవటంతో ప్రయాణీకులు ఇబ్బందులకు గురియ్యారు. అఫ్జల్‌గంజ్,సిబిఎస్,నాంపల్లి,శాలిబండ,ఆరాంఘర్ చౌరస్తా,మదీనా బస్టాపులలో ప్రయాణీకులు ఆర్టీసీ బస్సులు కోసం నిరీక్షించారు.బస్సులు కొరత ఉండటంతో ప్రయాణీకులు చాలా సమయం వరకు బస్సులు కొరకు ఎదురు చూశారు.బస్సులు తక్కువగా ఉండటంతో ప్రయాణీలు ఆటోలలో ప్రయాణం చేశారు.

మూసీ పరీవాహక ప్రాంతంలో అగ్ని ప్రమాదం

మెహిదీపట్నం, జనవరి 28, ప్రభాతవార్త :

కార్వాన్ మూసి పరివాహక ప్రాంతంలోని దేవాదాయ శాఖకు చెందిన స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో అగ్నిమాపక, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. జియాగూడ 100 ఫీట్ రోడ్డులో మూసి పరివాహక ప్రాంతం ఉంది. ఈ ప్రాంతం దేవాదాయ శాఖ పరిధిలోని అన్నపూర్ణ ఆలయానికి చెందిన స్థలంగా రికార్డులో ఉన్నప్పటికీ కొందరు భూ కబ్జాదారులు స్థానిక నేతల అండ దండలతో దేవాదాయకు చెందిన కొంత స్థలాన్ని కబ్జా చేసి రేకుల షెడ్లను నిర్మించారు .ఈ షెడ్లను కబ్జాదారులు అద్దె ప్రతిపాదికన ఇచ్చారు. ఇదిలా ఉండగా ఇలాంటి ఒక షెడ్డులో వినాయక విగ్రహాల తయారీ కోసం ఉపయోగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ అంటుకోవడంతో బుధవారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. స్థానికులు ఈ విషయాన్ని గమనించి అగ్నిమాపక, పోలీస్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఇటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కులుసుంపుర ఇన్ స్పెక్టర్ రాములు తెలిపారు.

మూసి పరివాహక ప్రాంతంలో నిర్మించిన అక్రమ షెడ్‌లో చెలరేగిన మంటలు.

సిఎం సహాయనిధి పత్రాలు అందజేత

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్, జనవరి 28 ప్రభాతవర్త: అంబర్ పేట్ నియోజకవర్గం గోల్నాక ప్రాంతానికి చెందిన దుర్గళ్ళ గణేష్ గారి సతీమణి రేణుక నిమ్స్ హాస్పటల్ వైద్యులు అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని తెలియజేయడంతో బాధితులు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ను ఆశ్రహించారు. స్పందించిన ఆయన ఎమ్మెల్యే వారిచే ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించారు. రూ. 3లక్షలు మంజూరు కావడంతో ఇందుకు సంబంధించిన పత్రాను బుధవారం పికెట్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రేణుకకు ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

యాకుత్‌పుర,జనవరి 28 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 29వ తేదీ గురువారం ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫారూఖ్‌నగర్,ఫాతిమానగర్ ఫీడర్ల పరిధులలో,10నుంచి 1 గంట వరకు గుంతల్ షాదర్గా ఫీడర్ పరిధిలో, 2 నుంచి 5 గంటలు వరకు వట్టెపల్లి,ఫలక్‌నుమా ఫీడర్ పరిధిలో,మధ్యాహ్నం 1 నుంచి 3 గంటలు వరకు ఫలక్‌నుమా ఓహెచ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

ప్రేమావతి పేటలో అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్

ప్రేమావతి పేటలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

చార్మినార్,జనవరి 28 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రేమావతిపేటలో నూతనంగా నిర్మిస్తున్న కమిటీ హాల్, మహిళా భవనం,సిసి రోడ్డు పనులను రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులలో ఎక్కడ నాణ్యత లేకుండ సకాలంలో పూర్తి చేయాలని జిహెచ్ఎంసిఅధికారులను ఆదేశించారు.ప్రేమావతిపేట శివాజీ యూత్ నాయకులకు కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి క్రికెట్ కిట్‌ను పంపిణీ చేశారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ పి.మల్లేష్ యాదవ్,జిహెచ్ఎంసి ఏఈ నరసింహమూర్తి,వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్,బిజెపి నాయకులు టి.సురేష్ ముదిరాజ్,మురళీ మోహన్,టి.రఘు ముదిరాజ్,నరోత్తం రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,శంకర్ రెడ్డి,ఈశ్వర్,శ్రీరామ్ యాదవ్.శ్రీధర్ ముదిరాజ్,భరత్ ముదిరాజ్,, వెంకటేష్, చక్రధర్, లక్ష్మణ్, గణేష్,శవేష్,ఉమేష్ రూగూర్,మహిళా సంఘం ప్రతినిధులు స్వరూప.రూపతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభించిన విజయారెడ్డి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న విజయారెడ్డి.

జూబ్లీహిల్స్, జనవరి 28, ప్రభాతవార్తః ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ డివిజన్ దుర్గానగర్ కాలనీ పంజాగుట్టలో రూ. 25.5 లక్షల వ్యయంతో చేపడుతున్న వీడీసీసీ రోడ్డు పనులను బుధవారం ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లాసిక్ ఎమరాల్డ్ అపార్ట్‌మెంట్ నుండి వెంకటేశ్వర అపార్ట్‌మెంట్ వరకు ఈ వీడీసీసీ రోడ్డు పనులను చేపడుతున్నామన్నారు. ఇక్కడ రహదారి సరిగా లేకపోవంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు. స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ భరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు సుబ్బారావు, అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

లోకాన్ని వదిలి వెళ్ళినా సేవలు గుర్తు ఉంటాయి

-ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణాచారి

కమ్యూనిస్ట్ కురువృద్ధుడు అచ్యుత రామయ్యకు జీవిత సాఫల్య పురస్కారం తో సత్కరిస్తున్న ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణాచారి

చిక్కడపల్లి జనవరి 28 (ప్రభాతవార్త) : లోకాన్ని వదిలి వెళ్ళినా కొందరు సమాజం కోసం వారి పరిధిలో కృషి చేసిన వారిని ప్రజలు గుర్తు ఉంచుకుంటారని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణ అన్నారు. బుధవారం త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై కళా నిలయం శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో యువ విద్యార్థి నాయకుడు ఫణి భార్గవ్ యాది లో పేరిట జయంతి సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ ప్రతిభా పురస్కారాలు దీప్తి వాజపేయి, ప్రవీణ్ కలవలకు నగదు పురస్కారం డిగ్రీ విద్యార్థులు రక్షిత, రాజేశ్వరి కి సామాజిక కార్యకర్త సాయి బాబా కీ బహుకరించారు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి తో కలసి డాక్టర్ రమణ సి పి యం నాయకుడు శత వసంతాల అన్నే అచ్యుత రామయ్య కు జీవిత సాఫల్య పురస్కారం తో సత్కరించి మాట్లాడారు ఎదిగి వచ్చిన కుమారుడు ఫణి నీ పోగొట్టుకున్న ఆ విషాదం మరచి తాను జర్నలిస్ట్ గా ఉండి రమణ ప్రతిభ కు విద్యార్థులకు అందిస్తున్న సత్కారం సత్కార్యం వెల కట్టలేనిది అని ప్రశంసించారు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి మాట్లాడుతూ కొడుకు గుర్తుగా తండ్రి ప్రతి ఏటా అతను జన్మ దినం నాడు చేస్తున్న కార్యక్రమం బహు అరుదు అన్నారు అధ్యక్షత వహించిన జవహర్ బాల భవన్ పూర్వ సంచాలకుడు డాక్టర్ రాము మాట్లాడుతూ గత పది సంవత్సరాలు గా ఫణి భార్గవ్ యాదిలో పేరిట జరుగుతన్న కార్యక్రమం లో ప్రతిభ వంతులు లకు చదువుకునే విద్యార్థులు కి అనాథ ఆశ్రయం కి సహకారం అందింస్తూ కొడుకు ను సజీవంగా నిలిపారు అని అభినందిచారు ప్రారంభ ప్రసంగం లో గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ ఫణి భార్గవ్ అరుదైన యువకుడు ఆదర్శవంత జీవితం గడిపి అకాల మరణం చెందటం బాధా కారం అని ఆవేదన వ్యక్తం చేశారు కళా నిలయం కార్యదర్శి సురేందర్ స్వాగతం పలికిన సభలో తొలుత నాట్య గురువు లు ప్రవల్లిక సుష్మా శిష్య బృందం కూచిపూడి నృత్యాలు శ్యామ్ గానం ఆకట్టుకున్నాయి

ఎమ్మెల్యే శ్రీగణేష్ దీక్ష డ్రామాలా ఉంది: బిఆర్ఎస్

కంటోన్మెంట్, జనవరి 28 ప్రభాతవర్త: కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ చేపట్టిన దీక్ష ఎందుకు చేపట్టారో ఎందుకు విరమించుకున్నారో 8 రోజులపాటు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఓ డ్రామాగా ఉందని బి ఆర్ ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే కృశాంక్ ఎద్దేవ చేశారు. బుధవారం పికెట్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డును గ్రేటర్లో విలీనం చేయాలని లక్ష మందితో సంతకాల సేకరణ చేపట్టి ఆ నివేదికను రక్షణ శాఖ మంత్రికి రాజ్‌నాథ్ సింగ్, ఎంపీ ఈటల రాజేందర్, రాహుల్ గాంధీలకు త్వరలోనే అందజేస్తామన్నారు. తాము చేపట్టే లక్ష సంతకాల సేకరణలో తొలి సంతకం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ముహూర్తం చేయించి తమ కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీలకు అతీతంగా కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల ప్రజలంతా సహకరించి తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే శ్రీ గణేష్ చేపట్టిన దీక్ష

మీడియాతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే కృశాంక్.

ఓ డ్రామాగా ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించక పోయిన హామీలు ఇవ్వకున్నా దీక్షణ విరమించుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే శ్రీ గణేష్ చేపట్టిన దీక్షకు ఒక్క మంత్రి కూడా స్పందించలేదన్నారు. అయితే ఆ ఎమ్మెల్యేకు రాహుల్ గాంధీ ఎలా స్పందిస్తారన్నారు. 8 రోజులపాటు నిర్వహించిన దీక్షలో ఎమ్మెల్యే చేపట్టిన ప్రసంగాలను వీడియో ద్వారా చూపిస్తూ విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు ఏ యల్ ఆనంద్, యాసీన్, మోని, గంగారాం అనీష్ వినీత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు

కన్నుల పండువగా గణేష్‌నగర్ అమృతాలయ శ్రీవేంకటేశ్వరస్వామి వార్షికోత్సవాలు

కుత్బుల్లాపూర్, జనవరి 28ప్రభాతవార్త శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖశాంతులతో మెలగాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షులు కొలను హానుమంతరెడ్డి అన్నారు. చింతల్ గణేష్‌నగర్‌లోని అమృతాలయంలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి 11వ వార్షికోత్సవానికి ఆలయ నిర్వాహకులు బొడ్డు వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులతో కలిసి స్వామి వారినిదర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.ఈ సందర్భంగా అమృతాలయ నిర్వాహకులు, మాజీ కార్పొరేటర్ ,కాంగ్రెస్ నాయకులు బొడ్డు వెంకటేశ్వరరావు, దుర్గారావు, చింతకుంట వెంకటేశ్ యాదవ్, లింగంయాదవ్, నర్సింహ్మారెడ్డి, ఎస్.ఎల్.నర్సింహ్మారావు, యాదగిరిబాపు లతోపాటు ఆలయ కమిటీ నిర్వాహకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కొలను హానుమంతరెడ్డి మాట్లాడుతూ గత 11ఏళ్లగా ఆలయ అభివృద్ధికి పాటుపడిన కమిటీ నిర్వాహకులను ఆయన అభినందించారు. కుత్బుల్లాపూర్ మాజీ కార్పొరేటర్ ఆలయ నిర్వాహకులు బొడ్డు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ ప్రారంభోత్సవానికి అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా శ్రీవేంకటేశ్వస్వామి, శివుడు, అమ్మవారు, ఆంజనేయుడివిగ్రహాలను

వేంకటేశ్వరస్వామి వార్షికోత్సరంలో పాల్గొన్న బొడ్డువెంకటేశ్వరరావు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షులు కొలను హానుమంతరెడ్డి, చింతకుంట వెంకటేశ్‌యాదవ్, లింగంయాదవ్, దుర్గారావు తదితరులు

తిరుపతినుండి ప్రత్యేకంగా తెప్పించి ప్రతిష్టించినట్లు తెలిపారు. దేవదేవుడు ప్రజలందరినీ చల్లగాచూడాలని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై వుండాలని ఆయన కోరారు. దైవకార్యాన్ని ఆధ్యాత్మికతతో విజయవంతం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మెన్ టి.లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు దమ్మాని శ్రావణ్‌కుమార్, గడ్డం రాజేందర్‌రెడ్డి, సిద్దనోళ్ల సంజీవరెడ్డి, సయ్యద్ రషీద్, శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షులు జాకీర్‌హుసేన్, శివ కుమార్,మహిళా అధ్యక్షురాలు సుజాతతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

రామ్‌మనోహర లోహియా సిద్ధాంతాలు, ఆశయాలు అమలు కోసం కృషి

సైఫాబాద్, జనవరి 28 ప్రభాతవార్త: ప్రముఖ సోషలిస్టు నాయకుడు డా.రామ్‌మనోహర్ లోహియా సిద్ధాంతాలు, ఆశయాలు అమలు కోసం తమ పార్టీ కృషి చేస్తుందని సోషలిస్ పార్టీ (ఇండియా) జాతీయ సెక్రటరీ జనరల్, మెగాసెస్ అవార్డు గ్రహీత సందీప్ పాండే, రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రరెడ్డి స్పష్టం చేశారు. సమానత్వం, సమాన విద్య, సమాన వైద్యం కలిగించాలని, ప్రైవేటీకరణకు సోషలిస్ట్ పార్టీ వ్యతిరేకమని, విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యా సంస్థల్లో 25 శాతం రిజర్వేషన్‌లు బిలో పావర్టి లెవల్ విద్యార్థులకు ఇవ్వాలని, ఓబిసిలకు 60 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని లోహియా ఏనాడో చెప్పారని వారు గుర్తు చేశారు. బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్, కార్పోరేషన్ ఎన్నికల్లో తమ పార్టీ అన్ని చోట్ల పోటి చేయడానికి సిద్ధంగా ఉందని, పార్టీకి కామన్ సింబల్ ఇవ్వడం వల్ల పోటీ చేయ

సమావేశంలో మాట్లాడుతున్న సందీప్ పాండే. చిత్రంలో రచ్చ సుభద్రరెడ్డి

డానికి చాలా మంది ముందుకు వస్తారని అశిస్తున్నామని చెప్పారు. ఒక్కొక్క జిల్లాకు ఒక్కొరిని ఇన్‌చార్జిగా నియమించడం జరిగిందని, పోటీ చేసేవారికి బి ఫాంలు రెడిగా ఉన్నాయని, డబ్బులు అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పార్టీలో చేరారు. వారికి పాండే కండువాలు కప్పి ఆహ్వానించడం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నేరటి వీరాంజనేయులు, మహమ్మద్ వాజీద్, మహమ్మద్ పాషా, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల రక్షణ కోసం నూతన కఠిన చట్టాన్ని తీసుకురావాలి

-తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్

చిక్కడపల్లి జనవరి 28 ప్రభాతవార్త : మైనారిటీల రక్షణ కోసం రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో "నూతన కఠిన చట్టాన్ని" తీసుకురావాలని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్ నేతృత్వంలో బుధవారం అత్యవసర సమావేశంలో ప్రతినిధులు బిషప్ కె. తిమోతి, బిషప్ ధనరాజ్ కోట, పాస్టర్లు పి. మెన్నో జోయెల్, కె. డేనియల్, తిమోతి, జీవన్ కుమార్, డి. సువార్తమ్మ, సి. హేమలత, ఎం. శాలిని, జైసన్ డేవిడ్, ఎం. భాస్కర్, నవీన్ చిట్టె, పి. జయ ప్రకాష్, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్ జిల్లాల పాల్గొన్నారు. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ క్రైస్తవ పాస్టర్లు సంఘాలపై దాడులను తీవ్రంగా ఖండిస్తూ రాష్ట్రంలోని వివిధ చర్చిలు, క్రైస్తవ సంస్థలు మరియు ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీల ఉమ్మడి వేదిక నేతృత్వంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బాప్టిస్ట్, మెథడిస్ట్, వెస్లీ, రాక్ చర్చ్, లూథరన్, హెబ్రోన్, హోసన్నా మినిస్ట్రీస్, బంజారా కమ్యూనిటీ మినిస్ట్రీస్, 26 నియోజకవర్గాల పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షులు, పెద్దలు పాల్గొన్నారు. రాష్ట్రంలో క్రైస్తవ పాస్టర్లు మరియు విశ్వాసులపై జరుగుతున్న దాడులను

తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గొనె సల్మాన్ రాజ్ నేతృత్వంలో అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమైన దృశ్యం

అసోసియేషన్ ఏకగ్రీవంగా ఖండించింది. 25న వనపర్తి జిల్లా ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సలకాపూర్ గ్రామంలో పాస్టర్ ప్రార్థనలు నిర్వహిస్తుండగా, కొంత మంది దుండగులు చర్చిలోకి చొరబడి అసభ్య పదజాలంతో దూషిస్తూ పాస్టర్ తో పాటు పురుషులు, మహిళలపై విచక్షణారహితంగా దాడి చేశారు. చర్చిలోని పవిత్ర వస్తువులను ధ్వంసం చేయడమే కాకుండా, పాస్టర్ మోటార్ బైక్‌ను కూడా ధ్వంసం చేశారన్నారు. ఈ విషయంలో తక్షణమే స్పందించి ఎనిమిది మందిపై కేసు నమోదు చేసిన వనపర్తి ఎస్పీకి, తెలంగాణ పోలీసులకు అసోసియేషన్ ధన్యవాదాలు తెలియజేస్తోంది. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రైస్తవ మైనారిటీలకు భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని మేము స్వాగతిస్తున్నామని అన్నారు.

బొగ్గు కుంభకోణం దృష్టి మరల్చేందుకే ఫోన్ ట్యాపింగ్ నోటీసులు : మహేష్ యాదవ్

జూబ్లీహిల్స్, జనవరి 28, ప్రభాతవార్తః బొగ్గు కుంభకోణం బయటపడగానే ప్రజల దృష్టి మరల్చేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నోటీసులకు తెర తీశారని సోమాజీగూడ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ సీనియర్ నాయకులు మహేష్ యాదవ్ అన్నారు. బంజారాహిల్స్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని రెండేళ్లు గడుస్తున్నా ఇంతవరకు హామీలు అమలు చేయలేదన్నారు. పాలన చేతకాక, హామీలు అమలు చేయక రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈ ఫోన్ ట్యాపింగ్ కుట్రను పన్నారన్నారు. బొగ్గు కుంభకోణంతోపాటు హామీల అమలు గురించి ప్రశ్నించిన నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్షపూరిత ధోరణితో కేటీఆర్, హరీష్‌రావు, సంతోష్‌రావులకు ఫోన్ ట్యాపింగ్

సమావేశంలో మాట్లాడుతున్న మహేష్ యాదవ్, చిత్రంలో నేతలు అహ్మద్, మధుకర్‌యాదవ్, అంజన్‌కుమార్, బాబు, వెంకటేష్.

కేసులో నోటీసులు పంపారన్నారు. ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. రేవంత్‌రెడ్డి పాలన మీద దృష్టి పెట్టి, ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఆయా హామీలను సాధించేవరకు తమ పోరాటం ఆగదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సోమాజీగూడ డివిజన్ అధ్యక్షుడు అహ్మద్, బీఆర్ఎస్ సీనియర్ నేతలు మధుకర్ యాదవ్, అంజన్‌కుమార్,బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా మల్లేశం నియామకం

చిక్కడపల్లి జనవరి 28 (ప్రభాతంవార్త) : చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ నూతన ఇన్స్‌పెక్టర్‌గా ఎం.మల్లేశం ను నియమిస్తూ నగర పోలీస్ కమీషనర్ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేసారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన బి.రాజు నాయక్ డిఐ అత్తాపూర్ గా బదిలీ కావడంతో, ఆయన స్థానంలో మల్లేశం ను కమీషనర్ నియమించారు. 2004 బ్యాచ్ కు చెందిన మల్లేశం గతంలో ఆర్ఎస్ఐగా , సివిల్ ఎస్ఐగా మారిన అనంతరం వికారాబాద్ ప్రాంతంలోని ధరూర్, సూర్యాపేట పోలీస్ స్టేషన్‌లలో విధులు సమర్థవంతంగా నిర్వహించారు. సిఐ గా పదోన్నతి పొందిన అనంతరం పోలీస్ శిక్షణ విభాగంలో, వికారాబాద్ జిల్లా ట్రైనింగ్ కళాశాలలో పని చేసారు. అనంతరం హైదరాబాద్ నగరంలో బేగంబజార్, పోలీస్ స్టేషన్‌లో డి ఐ గా, ట్రాఫిక్ విభాగం అడ్మిన్ గా, దోమలగూడ, కాచిగూడ డి ఐ గా బాధ్యతల నిర్వహిం చారు. ఈ సందర్భంగా మల్లేశం ప్రభాతవార్తతో మాట్లాడుతూ..తన పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిరంతరం నిఘా ఉంచుతామని, ప్రజల రక్షణే తమ ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు.

చిక్కడపల్లి డిఐ శంకర్ బదిలీ

కాగా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ (డి ఐ)గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం.శంకర్ ను ఖైరతాబాద్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా నగర పోలీస్ కమీషనర్ సజ్జన్నార్ బదిలీ చేసారు. కాగా ప్రస్తుతం చిక్కడపల్లి డి ఐగా కొత్తగా ఎవరిని నియమించలేదు. రెండు, మూడు రోజులలో నూతన డి ఐ ని నియమించే అవకాశం ఉంది.

సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుడికి ఒక బ్రహ్మాస్త్రం

-దీనిపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తాం

-ఆర్టిఐ హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ అసోసియేషన్

హైదరాబాద్,జనవరి 28,ప్రభాతవార్త: అవినీతిరహిత దేశంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషిచేస్తామని ఆర్టిఐ హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ అజయ్ కుమార్, అధ్యక్షులు మౌనిక దారా, ప్రధాన కార్యదర్శి వెంకటనరసింహారెడ్డి తెలిపారు. ప్రతి పౌరుడికి సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) ఒక బ్రహ్మాస్త్రం లాంటిదని, దానిని ఎలా ఉపయోగించుకోవాలని ప్రజలకు గ్రామస్థాయి నుంచిజిల్లా స్థాయి వరకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆర్టిఐ అప్లికేషన్లకు ఫిర్యాదు పెట్టెను గ్రామ, మండల, జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రజలకు, విద్యార్థులకు చట్టాల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యమని, ఆర్టిఐపై అవగాహన తరగతులు కూడా నిర్వహిస్తామని, ఇందుకు స్కూళ్లు కాలేజీలు తమను సంప్రదించాలని కోరారు. ఎన్నికలు

అవగాహన పత్రాన్ని విడుదల చేస్తున్న అజయ్‌కుమార్, మౌనిక, వెంకటనర్సింహ్మారెడ్డి తదితరులు

జరిగే ప్రాంతాల్లో మద్యం పంపిణీ, అమ్మకాలు అదుపులో ఉంచాలని, మద్యపాన లైసెన్స్ దారు నిర్దేశిత మద్యం అమ్మకం అమ్మేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా ప్రాంతాల్లోని మున్సిపాల్టీ ఎన్నికల పోలింగ్ రోజు షాపింగ్ మాల్స్, సినిమాహాళ్లు బంద్ చేయాలని, తద్వారా ఓటింగ్ పూర్తిగా జరిగే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో అసోసియేషన్ చీఫ్ ఇన్చార్జి వినోద్ కుమార్. ఇన్చార్జి ఎ.సాయిప్రసాద్ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలపై దాడిచేసిన కెటిఆర్ క్షమాపణ చెప్పాలి : కాంగ్రెస్ నేత చంద్రశేఖర్‌రెడ్డి

శేరిలింగంపల్లి,జనవరి 28 ప్రభాతవార్త దేశానికి గర్వకారణమైన రాజ్యాంగ విలువలను అపహాస్యం చేసేలా రాజకీయ విద్వేషంతో, దేశ గౌరవాన్ని కాలరాసే విధంగా, కాంగ్రెస్‌పార్టీ నాయకత్వాన్ని అవమానించే రీతిలో ప్రదర్శనలు చేసిన బీఆర్ఎస్ నేత కేటీఆర్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ యువజన నేత కట్ల చంద్రశేఖర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గణతంత్ర దినోత్సవం రోజున రాజకీయ కక్షలతో తెలంగాణ భవన్‌లో ద్వేషపూరిత ప్రదర్శనలు చేయింటాన్ని నిరసిస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ యువజన విభాగం నేత కట్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ. తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని అవమానించే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించటం బీఆర్ఎస్ పార్టీ తన రాజ్యాంగ వ్యతిరేక, ప్రజాస్వామ్య విరోధి అసలు ముఖాన్ని బట్టబయలు చేసిందన్నారు. జాతీయ పండుగ రోజున దుర్మార్గ చర్యలకు పాల్పడటం కోట్లాది ప్రజల మనోభావాలను అవమానించటమే అవుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్,జాతీయ నాయకులు రాహుల్ గాంధీలను అవమానించే ఉద్దేశంతో ప్రదర్శనలను నిర్వహించటం బీఆర్ఎస్

చందానగర్‌లో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

పార్టీ రాజకీయ దివాళకోరుతనాన్ని మరోసారి నిరూపించుకుందని విమర్శించారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కేటీఆర్ తక్షణమే కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని,లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు, నిరసనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిపాల్ యాదవ్, శ్రీహరి,రాజన్,ఉరిటి వెంకటరావు,కిశోర్ ముదిరాజ్, అలీ,జహంగీర్,అజముద్దీన

వైభవ్‌నగర్ పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ముషీరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త: బాగ్‌అంబర్‌పేట్ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అద్భుతమైన ఉద్యానవనం అందుబాటులోకి తీసుకువచ్చామని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డితో కలసి వైభవ్‌నగర్ పార్కుకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైభవ్‌నగర్ పార్కుకు పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో సుమారు 78లక్షల వ్యయంతో పార్కును అభివృద్ధి చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్, అధికారులు యూబీడీ మేనేజర్ ధీరజ్, శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు జెబిఎస్ నుంచి ప్రత్యేక బస్సులు : డిఎం రవిందర్

అడ్డగుట్ట,జనవరి 28 ప్రభాతవార్త: మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం సికింద్రాబాద్ జెబిఎస్ నుంచి ఈ నెల 31వ రకు 24 గంటల పాటు బస్ సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు పికెట్ డిపో మేనేజర్ ఎల్.రవిందర్ తెలిపారు. మహిళల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకం ఈ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని అయన తెలిపారు.

అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి : కొంతం దీపిక

మోండా డివిజన్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కమీషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

కంటోన్మెంట్,జనవరి 28 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లో నెలకొన్న సమస్యలు,వాటి పరిష్కారానికి నిధులు విడుదల చేయాలని కోరుతూ మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక జిహెచ్ఎంసి కమీషనర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపినేత కొంతం నరేశ్ పాల్గొన్నారు.

అడ్డగుట్ట తుకారాంగేట్ ప్రాంతాలను లాలాగూడ పిఎస్‌లో కలపొద్దు : అఖిల పక్ష కమిటీ

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అడ్డగుట్ట అఖిల పక్ష కమిటీ ప్రతినిధులు

అడ్డగుట్ట,జనవరి 28 ప్రభాతవార్త: దక్షిణ భారత దేశంలో అతి పెద్ద మురికివాడగా పేరొందిన అడ్డగుట్ట దాని పరిసర ప్రాంతాలైన సాయి నగర్, వెంకట్ నగర్, తుకారాంగేట్, గడ్డమీది బస్తీ, వడ్డెర బస్తీ, రియోపాయింట్,కొండా రెడ్డి నగర్ ప్రాంతాలను 2 కిలో మీటర్ల దూరంలో ఉన్న లాలాగూడ పోలీస్ స్టేషన్‌లో చేర్చడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందు వల్ల ప్రజలకు అందుబాటులో ఉన్న తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ భవన్‌లో లాలాగూడ పోలీస్‌స్టేషన్ కొనసాగే విధంగా చర్యలుతీసుకోవాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావు గౌడ్‌కు అడ్డగుట్ట అఖిల పక్ష కమిటీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.యాదగిరి,నక్క మధు,హంసరాజ్, ఆర్.మల్లేశ్,నర్సింగ్ రావ్,మనోహర్, శ్రీధర్ గౌడ్,శ్రీరామ్ నాయక్ పాల్గొన్నారు.

చైనామాంజాను తొలగించేందుకు కూకట్‌పల్లిలో స్పెషల్ డ్రైవ్

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 28, ప్రభాతవార్త గత రెండు రోజుల క్రితం మోటార్ సైకిల్‌పై వెళుతున్న తండ్రి కూతుళ్ళపై చైనా మాంజ పడడంతో ఐదేళ్ల చిన్నారి మృతి చెందిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో కూకట్‌పల్లి పోలీసులు, మున్సిపల్ సిబ్బంది బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో చెట్లపై విద్యుత్ స్తంభాలపై విద్యుత్ తీగలపై చుట్టుకుని ఉన్న చైనా మాంజలను తొలగించి వేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యువకులు చైనా వాడడం వల్ల పలు ప్రాంతాలలో ప్రమాదాలు జరిగాయి. కూకట్‌పల్లి వివేకానంద నగర్ సమీపంలో ముంబాయి రహదారిపై వెళ్తుండగా చిన్నారి నిష్విక ఆదిత్య మెడకు చైనా మాంజ చుట్టుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.దీంతో అధికారులు పలు ప్రాంతాల్లో వేలాడుతున్న చైనా మాంజలను తొలగించాలని ఆదేశాలు జారీచేసిన నేథ్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చైనామాంజలను తొలగించి వేశారు.

69వ జాతీయ పాఠశాల క్రీడల్లో తెలంగాణకు ప్రాతినిధ్యం

మేడ్చల్ విద్యార్థి బంకూరు చోదిత్‌కు ఉత్తమ స్పైకర్ అవార్డు

బంకూరు చోదిత్‌ను అభినందిస్తున్న దృశ్యం

నిజాంపేట్, జనవరి 28, ప్రభాతవార్త

మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా నిజాంపేట్‌లోని విజ్ఞాన్ విద్యాలయ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి బంకూరు చోదిత్ 2025లో నిర్వహించిన 69వ జాతీయ పాఠశాల క్రీడల్లో తెలంగాణ రాష్ట్రానికి విజయవంతంగా ప్రాతినిధ్యం వహించి ప్రత్యేక గుర్తింపు పొందారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం సిర్మూర్ జిల్లా పావంటా సాహిబ్‌లోని పీఎం ప్రభుత్వ బాలుర సీనియర్ సెకండరీ పాఠశాలలో జరిగిన అండర్-14 బాలుర వాలీబాల్ పోటీల్లో బంకూరు చోదిత్ పాల్గొన్నారు. టోర్నమెంట్‌లో జెర్సీ నంబర్-1తో బరిలోకి దిగిన చోదిత్ అద్భుతమైన ఆటతీరుతో ప్రేక్షకులను, కోచ్‌లను ఆకట్టుకున్నారు. పోటీల ముగింపులో టాప్-6 ఆటగాళ్లలో ఒకరిగా నిలిచిన ఆయనకు ఉత్తమ స్పైకర్ అవార్డు లభించడం విశేషం. ప్రత్యేకంగా, మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన ఏకైక విద్యార్థిగా చోదిత్ నిలవడం జిల్లా, రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా విజ్ఞాన్ విద్యాలయ స్కూల్ చైర్‌పర్సన్ రాణి రుద్రమదేవి, శారీరక విద్య ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చోదిత్‌ను ఘనంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అభివృద్ధి, నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయండి : ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

- జోనల్ కార్యాలయంలో కార్పొరేటర్లు, అధికారులతో సమీక్ష

చాంద్రాయణగుట్ట, జనవరి 28, ప్రభాతవార్త : అపరిష్కృతంగా ఉన్న అభివృద్ధి, నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. యాకుత్‌పురా నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి, నిర్మాణ పనుల పురోగతి, రానున్న షబే బరాత్, రంజాన్ పండుగలకు సంబంధించిన సమస్యలపై బుధవారం మధ్యాహ్నం చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నర్కి పూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో కార్పొరేటర్లు, పలు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంజనీరింగ్, ప్రాజెక్ట్స్, రోడ్డు విస్తరణ, నాలా అభివృద్ధి, నిర్మాణ పనులు, ఆరోగ్యం, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, వీధి దీపాలు తదితర విభాగాలకు సబంధించిన సమస్యలు, రానున్న రంజాన్ పండుగకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ మాట్లాడుతూ నియోజక వర్గంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి, నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్లు నిర్మాణ, ఎస్ఎన్‌డిపీ, నాలాలా విస్తరణ పనులు, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, డ్రైనేజీ, టౌన్ ప్లానింగ్‌ల సమస్యలను ఎప్పటికపుడు పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న

జోనల్ కార్యాలయంలో జెడ్పీ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులతో సమావేశమైన యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

నిర్మాణ పనులను వెంటనే చేపట్టి స్థానిక బస్తి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. షబే బరాత్, రంజాన్ పండుగకు సంబంధించిన అభివృద్ధి పనులను ముందస్తుగా చేపట్టాలన్నారు. రంజాన్ మాసంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, మహమ్మద్ వసీవుద్దిన్, నస్రీన్ సుల్తానా, అలంధార్ వాలాజహి, సంతోష్ నగర్, యాకుత్‌పురా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్‌లు మంగత యారు, సుభాష్‌రావు, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ ఇందిరా, మలేరియా ఎస్ఈ నామాల శ్రీనివాస్, ఈఈలు, డిఈలు, టౌన్ ప్లానింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోహింగ్యాలను వెనక్కి పంపేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి

-భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి డిమాండ్

హైదరాబాద్,జనవరి 28,ప్రభాతవార్త: భాగ్యనగరంలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశ్ మరియు రోహింగియా ముస్లిం చొరబాటుదారులను గుర్తించి, వారిని అరెస్టుచేసి తిరిగి పంపిందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రత్యేక జాయింట్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి డిమాండ్ చేసింది. ఈమేరకు బుధశారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానం ఏఐని ఉపయోగించి అక్రమ చొరబాటుదారులను గుర్తించే వేగవంతమైన ప్రక్రియ అమలు చేయాలని కోరారు. భారతీయ చట్టాల ప్రకారం ఇక్కడ అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశ్ రోహింగియా ముస్లింలు అందరూ చొరబాటుదారులేనని వారికి ఆశ్రయం కల్పించేవారు మరియు నకిలీ పత్రాలు సృష్టించి ఇచ్చే స్థానిక నెట్వర్క్ పైన దేశద్రోహం కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిజాం కాశీం రజ్వీల రజాకార్ భావజాలం చొరబాటుదారులకు సహకరిస్తూ భాగ్యనగర్ భద్రతను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నారన్నారు. భాగ్యనగరంలో ఉన్న డిఆర్‌డివో లాంటి రక్షణ రంగ సంస్థల చుట్టూ రోహింగియా ముస్లిం అక్రమ కాలనీలు పుట్టుకొచ్చాయని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే 6993 మంది చొరబాటుదారులు ఉన్నారని సాక్షాత్తు రాష్ట్ర హైకోర్టు ముందు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం సమస్య తీవ్రతను తెలియజేస్తుందన్నారు. కావున భాగ్యనగరంలో చొరబడిన లక్షలాది మంది చొరబాటుదారులను అరెస్టు చేసి తిరిగి పంపడంలో ఇక ఏమాత్రం ఆలస్యం చేయొద్దని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సమితి అడ్వైజర్ రామరాజు, గోవింద్, వైకుంఠం, శ్రీరాం వ్యాస్, చంద్రశేఖర్, శ్యామ్, ఆనంద్‌గుప్త పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ తదితరులు

పెద్దమ్మ తల్లి దివ్యాశీస్సులు ప్రజలందరిపై ఉండాలి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

ఎమ్మెల్యే వివేకానంద్ సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

జీడిమెట్ల, జనవరి 28, ప్రభాతవార్త

పెద్దమ్మ తల్లి దివ్యాశీస్సులు ప్రజలందరిపై ఉండాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆకాంక్షించారు. బుధవారం 130 సుభాష్ నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్‌లోని శ్రీ పెద్దమ్మ పోచమ్మ తల్లి దేవాలయం 21వ వార్షికోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి దివ్యాశీస్సులు ప్రజలందరిపై ఉండాలనీ, అమ్మవారికి కృపా కటాక్షాలతో ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి, ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, పుప్పాల భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు బొబ్బ రంగారావు, ఏవి. శేషాచారి, గోపాల్ రెడ్డి, బొబ్బ ప్రసాద్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, భాస్కర్ రెడ్డి,పూర్ణ చంద్రగుప్త, శ్రీనివాస చారి, టిటికె శ్రీనివాస్, ప్రభాకర్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్టలో ప్రభుత్వ భూములను కాపాడండి : సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

ఆర్ఐ కరీముల్లాకి వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు

జగద్గిరిగుట్ట, జనవరి 28, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం రెవెన్యూ డివిజన్లోని జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సంబంధించి భూములలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిని వెంటనే అడ్డుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని బుధవారం కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారి కార్యాలయంలో ఆర్ఐ కరీముల్లాకి సిపిఐ నాయకులు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ మండలంలో హైడ్రా అధికారులు వచ్చి హెచ్చరించినప్పటికీ అనేక ప్రాంతాలలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని అధికారులు కబ్జాలు చేస్తున్న వారి పేర్లు తెలిసినప్పటికీ వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్లే మళ్లీ మళ్లీ కబ్జాలు చేసుకుంటూ ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాలని లేనిపక్షంలో వచ్చే వారం ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్షలను ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు, రాములు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మండల కోశాధికారి సదానంద్ సిపిఐ నాయకులు ఇమామ్, వంశీ తదితరులు పాల్గొనడం జరిగింది.

ఫిబ్రవరి 6 నుంచి బిఎంఎస్ అఖిలభారత మహాసభలు

చిక్కడపల్లి జనవరి 28 (ప్రభాతవార్త) : భారతీయ మజ్దూర్ సంఘ్(బిఎమ్ఎస్) అఖిలభారత మహాసభలు ఫిబ్రవరి 6.7.8 తేదీలలో ఒడిస్సా రాష్ట్రం పూరి నగరంలో నిర్వహించడం జరుగుతుందని బిఎంఎస్ ఆలిండియా ఉపాధ్యక్షుడు ఎస్. మల్లేశం తెలిపారు. బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ బి ఎం ఎస్ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాని కార్యదర్శి రాంరెడ్డి, జిహెచ్ఎంసి బిఎంఎస్ ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ తో కలిసి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 2500 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరుకానున్నట్లు తెలిపారు. కేంద్రమంత్రి మనసుక్ మాండవియా ప్రారంభిస్తారని.బ్రిక్స్ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులు, సదస్సును ఒడిస్సా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఆటలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

నార్సింగి, జనవరి 28 ప్రభాతవార్త :

ఆటలు విద్యార్థులలో ఆత్మ విశ్వాసంను పెంపొందిస్తాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం గండిపేట మండల పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు బండ్లగూడలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం క్రీడామైదానంలో సీఎంకప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. సరదాగా విద్యార్థులతో కలిసి కబడ్డీ, వాలీబాల్ ఆడారు. అనంతరం ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ఆటలు మనలో విజయకాంక్షను, తప్పులును సరిదిద్దుకునే అలవాటును, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే మనస్తత్వంను పెంచుతాయన్నారు. ఎదిగే వయసులో ఉన్న విద్యార్థులు చదువులతో పాటు ఆటలకు కూడా తగిన సమయంను కేటాయించాలన్నారు. ఆటల వలన కలిగే ఆనందం వెల కట్టలేనిదని, ఆనందం మనలో మంచిమార్పును తీసుకు వస్తుందన్నారు. విద్యార్థులలోని ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఈ సీఎంకప్ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ సునిల్ కుమార్, నాయకులు కృష్ణారెడ్డి,సురేష్‌గౌడ్, నవీన్,గణేష్,హరీష్‌గౌడ్ పాల్గొన్నారు. రైటప్: సమావేశంలో మాట్లాడుతున్న టి.రాజు. చిత్రంలో చిరంజీవులు, పొన్నం దేవరాజ్‌గౌడ్ తదితరులు

బార్ కౌన్సిల్ ఎన్నికల్లో బిసిలకే పట్టం కట్టాలి

సైఫాబాద్, జనవరి 28 ప్రభాతవార్త: బార్ కౌన్సిల్‌కు జరిగే ఎన్నికల్లో బిసి, ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు బిసి అభ్యర్థులకే ఓట్లు వేస్తే కౌన్సిల్ మొత్తం బిసిల చేతుల్లోకి వస్తుందని ఆల్ ఇండియా ఓబిసి ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.ఈశ్వరయ్య, బిసి మేధావుల ఫోరం ఛైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు, బిసి లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తలకొక్కుల రాజు, పొన్నం దేవరాజ్‌గౌడ్ చెప్పారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ న్యాయస్థానాల్లో బిసి న్యాయవాదులు లేకపోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బిసిలకు న్యాయం జరగడం లేదని, అన్యాయాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి పరిస్థితుల్లో బిసి, ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు బార్ కౌన్సిల్ ఎన్నికల్లో బిసి అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అనేక మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

పార్కులను కబ్జా నుంచి విడిపించాలని డిసికి వినతి

నార్సింగి, జనవరి 28 ప్రభాతవార్త : నార్సింగి సర్కిల్ పరిధిలో ఉన్న పార్కులను కబ్జా నుంచి విడిపించాలని కోరుతూ డిసి కృష్ణ మోహన్‌రెడ్డికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నార్సింగికి చెందిన దేవందర్ మాట్లాడుతూ నార్సింగి సర్కిల్ సర్వే నెంబర్లు 300, 303, 306, 311, 313, 315లలో 85.ఎకరాల భూమి ఉందని తెలిపారు. శ్రీరాంనగర్ కాలనీకి సంబంధించిన లేఅవుట్‌లో 6,058.చదరపు గజాల స్థలంలో నాలుగు పార్కులకు కేటాయించారని, 30.ఆగస్టు 1993.లో భగవాన్‌దాస్ తండ్రి అంజయ్య మరో 8.మంది కలిసి 11194/1993 రిజిస్ట్రేషన్ నెంబర్ ప్రకారం గ్రామ పంయాతీయికి గిఫ్టు డీడ్ సెటిల్‌మెంట్ చేశారని వివరించారు. 8174చదరపు గజాలు కమర్షియల్ కాంప్లెక్స్‌కు చూపించారని, 34026 చదరపు గజాల స్థలం రోడ్లకు, 71,584.చదరపు గజాల స్థలం ప్లాటింగ్‌కు, 2261. చదరపు గజాల స్థలం ఇతర అవసరాలకు కేటయించినట్లు హుడా లేఅవుట్ పర్మిషన్ పొందారని తెలిపారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పార్కు స్థలాలు కబ్జాపాలవుతున్నాయని, ఈ పార్కుల స్థలంను కాపాడాలని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిసికి ఇచ్చిన వినతిపత్రంలో కోరామని దేవేందర్ తదితరులు వివరించారు.

నార్సింగి సర్కిల్ పరిధిలో పార్కులను కబ్జా నుంచి విడిపించాలని డిసి కృష్ణమోహన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు.

దుండిగల్ సర్కిల్-59లో స్పెషల్ శానిటేషన్‌పై అదనపు కమిషనర్ పర్యవేక్షణ

దుండిగల్, జనవరి 28, ప్రభాతవార్త

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని దుండిగల్ సర్కిల్-59లో చేపట్టిన స్పెషల్ శానిటేషన్ కార్యక్రమాలను జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ జీ. శ్రీజన ఐఏఎస్ బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం వేళల్లోనే మెయిన్ రోడ్లు, చౌరస్తాలు, జంక్షన్ పాయింట్లు పూర్తిగా శుభ్రపరచాలని అధికారులకు సూచించారు. ప్రజలు ఎవరూ చెత్తను రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో పడవేయకూడదని, తడి చెత్త-పొడి చెత్తను వేరు చేసి ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి చెత్తను బయట పడవేసిన వారిపై జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా, రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రత పాటించాలన్నారు. చెత్త పేరుకుపోయే గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ గుర్తించి వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నందున వ్యాపార సంస్థలు, హోటళ్లు, షాపులు ఎవరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించరాదని స్పష్టంగా సూచించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, శానిటేషన్ డీఈఈ అన్వేష్ రెడ్డి, ఏఈఈ అశోక్ కుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్ సుభాష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సాత్విక్, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ శానిటేషన్‌పై సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ జీ.శ్రీజన

రాబోయే ఎన్నికలే లక్ష్యంగా బిజెపి వ్యూహాత్మక సమావేశం : కంచి మహేందర్

మూసాపేట్, జనవరి 28, ప్రభాతవార్త

రాబోయే స్థానిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్ బుధవారం తన కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుని కలిశారు. ఈ భేటీ సందర్భంగా ప్రస్తుత స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తల సమన్వయం తదితర కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు.బూత్ స్థాయి నుంచి మండల, డివిజన్ స్థాయి వరకు పార్టీని మరింత పటిష్టం చేయాల్సిన అవసరాన్ని ఇరు నేతలు స్పష్టం చేశారు. యువత, మహిళలు, వెనుకబడిన వర్గాల్లో బీజేపీ ప్రభావాన్ని పెంచే దిశగా సమగ్ర కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు. ప్రజా సమస్యలపై బీజేపీ చేపడుతున్న ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని, ప్రజల తరఫున పోరాటం మరింత బలంగా సాగించాలని ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కంచి మహేందర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే బీజేపీ ప్రధాన అజెండా అని పేర్కొన్నారు. పార్టీ విధానాలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు మాట్లాడుతూ, పార్టీ శ్రేణులు సమిష్టిగా, క్రమశిక్షణతో పనిచేస్తే రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని, రాబోయే ఎన్నికల సన్నాహాల్లో ఇది కీలక మైలురాయిగా మారిందని బీజేపీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

మైనర్ బాలికను విక్రయించాలని యత్నించిన వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్ష ..

- స్టేషన్ సిబ్బందిని అభినందించిన ఉన్నతాధికారులు

చాంద్రాయణగుట్ట, జనవరి 28, ప్రభాతవార్త : మైనర్ బాలికను కిడ్నాప్ చేసి విక్రయించాలని చూసిన ఒక వ్యక్తికి కోర్టు మూడేళ్ళ జైలుశిక్ష, వేయి రూపాయల జరిమానా విధించింది. ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్ వర్మ తెలిపిన వివరాల ప్రకారం... 2023, డిసెంబర్ 21న ఉప్పుగూడ కృష్ణారెడ్డి

ఆకట్టుకున్న గోల్డెన్ ఆఫ్ తెలంగాణ బాడీ బిల్డింగ్ పోటీలు

విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు గాజుల శివప్రసాద్ తదితరులు

మలక్ పేట, జనవరి 28, ప్రభాతవార్త:
గోల్డెన్ మెన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఓపెన్ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముసారాంబాగ్ డివిజన్ ఎస్బిహెచ్ కాలనీలో నిర్వాహకులు గాజుల శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీలలో నగరానికి చెందిన పలువురు బాడీబిల్డర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ శ్రీధర్ జి విచ్చేసి బాడీ బిల్డింగ్ పోటీలలో గెలుపొందిన విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గాజుల శివప్రసాద్ మాట్లాడుతూ 18 కేటగిలలో పోటీలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. బాడీ బిల్డింగ్ పోటీలలో అమర్ దీప్ మొదటి స్థానం, సోహైల్ ద్వితీయ స్థానం సాధించారని వివరించారు. ప్రతి సంవత్సరం గోల్డెన్ మాన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహిస్తున్నమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిరంజన్ యాదవ్, సురేందర్ రెడ్డి, సందడి సురేందర్ రెడ్డి , గౌర దేవేందర్, జక్కా మోహన్ రెడ్డి, రమేష్ రెడ్డి, ఆవుల ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యుడు అవార్డును అందుకున్న డాక్టర్ లింగం గౌడ్

కలెక్టర్ హరిచందన చేతుల మీదుగా ఉత్తమ వైద్యుడు అవార్డును అందుకుంటున్న డాక్టర్ లింగం గౌడ్

మలక్ పేట, జనవరి 28, ప్రభాతవార్త:
మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ టి.లింగం గౌడ్ ఉత్తమ వైద్యుడు గా అవార్డును అందుకున్నారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ లింగం గౌడ్ కు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన ఉత్తమ డాక్టర్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లింగం గౌడ్ మాట్లాడుతూ తనకు ఉత్తమ వైద్యుడు అవార్డు అందజేయడం సంతోషంగా ఉందని, తనకు అవార్డును అందజేయడం పట్ల కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఉత్తమ వైద్యుడిగా అవార్డు అందుకున్న డాక్టర్ లింగం గౌడ్ ను పలువురు అభినందించారు.

గ్రీవెన్స్ కార్యక్రమానికి 103 వినతులు

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి : చైర్మన్ ముత్తినేని వీరయ్య

దివ్యాంగుల సమస్యలను తెలుసుకుంటున్న చైర్మన్ ముత్తినేని వీరయ్య

మలక్ పేట, జనవరి 28, ప్రభాతవార్త:
దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి మొదటిసారిగా కార్పొరేషన్ లో గ్రీవెన్స్ (వినతుల స్వీకరణ) కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. కార్పొరేషన్ లో మొదటిసారి ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి బుధవారం మొత్తం 103 వినతులు వచ్చాయని, అందులో ఇందిరమ్మ ఇళ్లు, దివ్యాంగుల ఉపకరణాలు, సదరం సర్టిఫికెట్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు, బ్యాక్ లాగ్ పోస్టులు, పోలీస్, జిహెచ్ఎంసి, ఎండోమెంట్, ఆర్టిసి శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే అంశాలపై ఈ వినతులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. దివ్యాంగ నిరుద్యోగుల ఉపాధికోసం వివిధ శాఖల అధికారులతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగ నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు వివిధ డిపార్ట్ మెంట్ లలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కల్పన కోసం కృషి చేయనున్నట్లు ఆయన వివరించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెల మొదటి , మూడవ బుధవారాల్లో దివ్యాంగుల సహకార సంస్థ కార్యాలయంలోవినతుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

సి.సి.రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

వనస్థలిపురం జనవరి. 28. ప్రభాతవార్త
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ కాలనీలో 64.00 లక్షల రూపాయలతో అభివృద్ధి చేస్తున్న సిసి రోడ్డు పనులను బుధవారం బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం పనుల్లో నాణ్యత పరిమాణాలు పాటించాలని, లెవెల్స్ సరిచూసుకుంటూ రోడ్డు నిర్మాణం చేపట్టాలని మరియు కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శ్రీధర్, సుధీర్ మరియు పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి మరియు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం సూపర్వైజర్ శ్రీకాంత్ మరియు తదితరులు ఉన్నారు.

బిఆర్ఎస్ నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి

సైదాబాద్, జనవరి 28 ప్రభాతవార్త:
బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీని యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాకుత్‌పుర నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలందరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ సదన్ డివిజన్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ప్రవీణ్ రాజ్, సాయిబాబ, చింతల శ్రీనివాస్, ఎజాజ్, రవి తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం. జనవరి. 28. ప్రభతవార్త
వనస్థలిపురం డివిజన్ పద్మావతి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తమ కాలనీ సమస్యలపైన నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దానిలో బాగంగా కాలనీలో అక్కడక్కడ కరెంట్ సమస్య, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కుక్కల సమస్య మరియు సీసీ కెమెరాల సమస్య లాంటివి పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా రోడ్డు నంబర్లు 1 నుండి 3 వరకు పూర్తిగా దెబ్బతిన్నాయని నూతన రోడ్లు వేయాలని మనవి చేశారు. అలాగే ట్రాన్స్ఫార్మర్స్ మంజూరు కావడం జరిగిందని అట్టి ట్రాన్స్ఫార్మర్స్ నిర్మాణంలో బాగంగా పక్కన ఉన్న ఇతర స్థల యజమానులు అభ్యంతరం తెలపడంతో అట్టి ట్రాన్స్ఫార్మర్స్ నిర్మాణం ఆగిపోయిందని అన్నారు. అలాగే నూతన పార్కు నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మీరు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. కరెంటు సమస్య లేకుండా మరొక ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయిస్తానని, కాలనీ కమ్యూనిటీ హాల్ విస్తరణ కోసం పక్క లేఔట్ వాళ్లని రిక్వెస్ట్ చేసి సహకరిస్తానని అన్నారు. రేడియో స్టేషన్ దగ్గర రోడ్డు మార్గానికి మరియు రోడ్డు విస్తరణకు కూడా సహకరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ట్రాఫిక్ సమస్యను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి త్వరలోనే చుట్టూ పక్కల కాలనీ వాసులతో మరియు అధికారులతో మీటింగ్ ఏర్పాటు చేస్తామని, నియోజకవర్గంలో ప్రతి సమస్యపైన నాకు అవగాహన ఉంది అని త్వరలోనే ప్రతి ఒక్కటి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే నూతన రోడ్లు కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్ గౌడ్, దూసరి మధుగౌడ్, నవీద్ కాలనీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీనివాస రావు, కోశాధికారి విజయ్ కుమార్, ఉపాదక్షులు ఆంజనేయులు, సయ్యద్ జాహీద్ అలీ, మల్లేశ్, జాయింట్ సెక్రటరీ రఘుపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చొరవతోనే చురుకుగా పోచమ్మకుంట సుందరీకరణ పనులు

సరూర్‌నగర్, డిసెంబర్ 28 ప్రభాతవార్త: కాంగ్రెస్ చొరవతోనే అల్మాస్‌గూడ పోచమ్మకుంట అభివృద్ధి సుందరీకరణ పనులు పునః ప్రారంభమై చురుకుగా సాగుతున్నాయని పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి స్పష్టం చేశారు. జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని నాదర్‌గుల్ డివిజన్ 57 కిందకు వచ్చే అల్మాస్‌గూడ పోచమ్మ కుంట అభివృద్ధి, సుందరీకరణలో భాగంగా జరుగుతున్న ఫెన్సింగ్, లైటింగ్ ఏర్పాటు పనులను మల్లారెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ నాయకుల బృందం పరిశీలించింది. ఈ మేరకు వారు పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌తో కలిసి పాదయాత్రలు చేస్తూ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ప్రారంభమైన చెరువు సుందరీకరణ అభివృద్ధి పనుల్లో అవినీతి అక్రమాలు జరిగాయనీ ఎన్నికల తర్వాత పనులు ఆగాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీ తరపున తాము మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కెఎల్ఆర్ దృష్టికి తీసుకెళ్లి చెరువుల సుందరీకరణ పనుల్లో జరిగిన అవినీతి, పనుల్లో జాప్యంపై వివరించామని ఆయన వెల్లడించారు. దీంతో కెఎల్ఆర్ చెరువును పరిశీలించిన తదుపరి జిల్లా ఇంఛార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా మంత్రి హెచ్ఎండిఎ కమీషనర్‌కు ఆదేశాలు ఇవ్వడంతో పనులు ప్రారంభమయ్యాయని మల్లారెడ్డి వివరించారు. ప్రస్తుతం చెరువు అభివృద్ధి పనులు జరగుతుండడం పట్ల పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ మేరకు పూర్తిస్థాయిలో పనులు జరుగుతున్నందుకు ఆయన మంత్రి శ్రీధర్‌బాబు, ఇంఛార్జి కెఎల్ఆర్‌కు, డిసి సరస్వతికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్గారి శ్రీధర్‌రెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, నవారు ప్రభాకర్‌రెడ్డి, న్యూమధురాపురి కాలనీ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వై.జైపాల్, వంశీ, చంద్రన్, ఏనుగు వంశీ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మకుంట సుందరీకరణ పనులను పరవేక్షిస్తున్న నవారు మల్లారెడ్డి తదితరులు

డివిజన్లలో దోమల బెడదను తీర్చడంలో అధికారులు విఫలం

-కార్యాలయంలో పొగబెట్టి మస్కిటో బ్యాట్లతో బిజెపి నిరసన

సరూర్‌నగర్, డిసెంబర్ 28 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని జిల్లెలగూడ, మీర్‌పేట్, ప్రశాంతి హిల్స్, బడంగ్‌పేట్, నాదర్‌గుల్, బాలాపూర్ డివిజన్లలో ప్రజలకు దోమల బెడదను తీర్చడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో నాయకులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. దోమల తాకిడితో ప్రజలకు నిద్ర కరువవ్వడమే కాకుండా రోగాల బారిన పడుతున్నా సంబంధిత అధికారులు ఫాగింగ్ పేరుతో కాలయాపన చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహించిన బిజెపి నేతలు ఏకంగా సర్కిల్ కార్యాలయంలోనే ఆందోళనకు దిగారు. ఈ మేరకు బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లకు చెందిన బిజెపి అధ్యక్షులు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, పసునూరి బిక్షపతిచారి, తులసి ముఖేష్ ముదిరాజ్‌లు పలువురు నాయకులతో కలిసి సర్కిల్ కార్యాలయంలో దోమల పొగ బెట్టి మస్కిటో బ్యాట్లు చేతపట్టి వినూత్న నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కుబడిగా ఫాగింగ్ చేస్తున్న అధికారులు దోమల లార్వాలను నిర్మూలించాలనీ, చెరువుల్లో గుర్రపు డెక్క ఆకులు తీయించాలనీ, ప్రతి రోజూ పక్కాగా అన్ని ప్రాంతాల్లో ఫా గింగ్ చేయించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల నర్సింహ, కీసర గోవ ర్ధన్‌రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సూల ప్రభాకర్, యాదగిరి యాదవ్, ముత్తంగి కరుణానిధి, భీమ్‌రాజ్, కొంతం ప్రకా శ్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, సిద్దాల శ్రీనివాస్, బుచ్చిరాములు, విక్కీ సాగర్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, రేసు నర్సింహారెడ్డి, కుంటి భాస్కర్, ప్రవీణ్, కిశోర్, పద్మ, మీనాక్షి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో దోమల నివారణ పొగ పెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, పసునూరి బిక్షపతిచారి, తులసి ముఖేష్ ముదిరాజ్ తదితరులు

ప్రభుత్వ కార్యాలయాలకు జిహెచ్ఎంసి స్థలాలు కేటాయింపు

-రామంతాపూర్‌లో కొత్త పోలీస్‌స్టేషన్, ఎక్సైజ్ స్టేషన్ ఏర్పాటు

ఉప్పల్, జనవరి 28 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ భవనాలను జిహెచ్ఎంసి కమ్యూనిటిహాల్స్‌లోకి తరలించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే అద్దె భవనాల్లో కొనసాగుతున్న పలు ప్రభుత్వ కార్యాలయాలను ఖాళీగా ఉన్న జిహెచ్ఎంసి కమ్యూనిటిహాల్‌లోకి తరలించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్న ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను రామంతాపూర్ వార్డు కార్యాలయానికి తరలించాలని అధికారులు నిర్ణయించారు. హబ్సిగూడలోని పాత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని జోనల్ ఆఫీసు సిబ్బందికి కేటాయించారు. ఉప్పల్‌లోని మరో భవనాన్ని కూడా జిల్లా ఎక్సైజ్ సూపరిటెండెంట్ ఆఫీసుకు కేటాయించాలని నిర్ణయించారు. రామంతాపూర్ ఆర్‌టిసి కాలనీలో ఉన్న మీసేవా కేంద్రానికి మరో చోట స్థలం కేటాయించి అక్కడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నారు. ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు సిబ్బంది స్థలాన్ని పరిశీలించారు. ఇంకా ఉన్నతాధికారుల నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదని అధికారులు పేర్కొంటున్నారు. రామంతాపూర్ బైపాస్ రోడ్డులో అద్దె భవనంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అక్కడి నుంచి తరలించేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే నెల చివరిలోగా కార్యాలయం అక్కడి నుంచి స్వంత భవనంలోకి మార్చాలని ఆదేశాలు ఉన్నాయి. అద్దె భవనాల్లో ప్రభుత్వ భవనాలు ఉండడం వల్ల ప్రతి నెలా అద్దె భారం ప్రభుత్వంపై పడుతుందని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉప్పల్ ఎక్సైజ్ అధికారులతోపాటు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు అధికారులు, మరో రెండు శాఖల అధికారులు కూడా జిహెచ్ఎంసి కమ్యూనిటిహాల్స్ కేటాయించాలని ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లో తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు (ఫైల్‌ఫోటో)

రామంతాపూర్‌లో కొత్త పోలీస్‌స్టేషన్ ఏర్పాటు :
ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌ను అధికారులు రెండుగా విభజించనున్నారు. ప్రస్తుతం ఉప్పల్, రామంతాపూర్, చిలుకానగర్ ప్రాంతాలుగా ఉన్న ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిని విస్తరించారు. కొత్తగా హబ్సిగూడ ప్రాంతాన్ని ఉప్పల్ పిఎస్ పరిధిలోకి తెచ్చారు. రామంతాపూర్, హబ్సిగూడ, వెంకటేశ్వర్రెడ్డినగర్ ప్రాంతాలను కలిసి రామంతాపూర్ పోలీస్‌స్టేషన్‌గా ఏర్పాటు చేస్తున్నారు. ఉప్పల్, చిలుకానగర్, బీరప్ప గడ్డ ప్రాంతాలను కలిసి ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌గా ఏర్పాటు చేస్తున్నారు. రామంతాపూర్ పోలీస్‌స్టేషన్‌కు ప్రస్తుతం ఉప్పల్‌లో ఉన్న అధికారులను కేటాయించాలని నిర్ణయించారు. స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌ను కొత్తగా కేటాయిస్తారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటికే ఆదేశాలు అందాయని ఉప్పల్ ఇంచార్జీ ఎసిపి ఎస్.చక్రపాణి తెలిపారు. కాగా కొత్త పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిజిపి శివధర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. దీంతో ఆయన స్పందించి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. రామంతాపూర్ పోలీస్ స్టేషన్ ప్రారంభంతో శాంతిభద్రతలు మరింత మెరుగుపడతాయని, ప్రజల సమస్యలకు వెంటనే పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని అన్నారు.

రాజ్‌నగర్ కాలనీ సమగ్రాభివృద్ధికి కృషి : ఎం.రజితరెడ్డి

ఉప్పల్, జనవరి 28 ప్రభాతవార్త :
ఉప్పల్ డివిజన్ రాజ్‌నగర్ కాలనీ సమగ్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉప్పల్ రాజ్‌నగర్ కాలనీలో రూ.42 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకుని వచ్చారు. కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, వర్షాకాలంలో రోడ్లన్ని బురదమయంగా మారుతున్నాయని తెలిపారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కోరారు. దీనిపై కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి స్పందిస్తూ రాజ్ నగర్ కాలనీలో డ్రైనేజీ, వర్షపు నీటి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ వెన్నెల గౌడ్ ,ఏఈ రాజ్ కుమార్, జలమండలి మేనేజర్ సత్యనారాయణ, కాలనీ నేతలు దుబ్బ నర్సింహ రెడ్డి, కల్లూరి వేణు, అయోధ్య, జీవన్‌రెడ్డి, డేవిడ్, కిషోర్, కేశవ రావు ,పవన్, బాలు, నాగరాజు, రాజ్ కుమార్, చంద్రం, ప్రశాంత్, చారి, శ్రీ బాలాజీ, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ రాజ్‌నగర్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

రంజీ క్రీడాకారిణి ప్రతీకకు బన్నాల ప్రవీణ్ అభినందన

ఉప్పల్, జనవరి 28 ప్రభాతవార్త :
హబ్సిగూడకు చెందిన రంజీ క్రికెట్ క్రీడాకారిణి కంచర్ల ప్రతీక భారత జట్టు సీనియర్స్ మహిళ వన్డే ట్రోఫీ రంజీ ట్రోఫీకి ఎంపిక కావడం హర్షనీయమని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం హబ్సిగూడలో ఆమెను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో ప్రతీక సెంచరీ చేయడం అభినందనీయమని అన్నారు. రాబోయే రోజుల్లో భారత జట్టుకు ఎంపిక కావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతీక తండ్రి కంచర్ల సోమిరెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన శాలువాతో సత్కరించారు.

నార్మల్ మదర్ డెయిరీ చైర్మన్‌గా మల్లి మధుసూదన్ రెడ్డి ఎన్నిక

హయత్ నగర్, జనవరి 28 ప్రభాతవార్త :
నార్మల్ మదర్ డెయిరీ చైర్మన్ గా గుడిపాటి మధుసూదన్ రెడ్డి మరోసారి ఎన్నికయ్యారు. పాలక వర్గ సభ్యుల ఒత్తిడితో ఈనెల 8న రాజీనామా చేయగా... రైతులకు 12 కోట్ల పాల బిల్లులను చెల్లిస్తా నంటూ ప్రభాకర్ రెడ్డి పదవిలోకి వచ్చాడు. అయితే 15 రోజులు తిరగకుండానే అయన సైతం రాజీనామా చేయడంతో పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. ఈ క్రమంలో పాలకవర్గ సభ్యులు అంతా కలిసి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ని కలిశారు. సుఖ్నేదర్ రెడ్డి ఎలాంటి హామీ ఇవ్వక పోవడంతో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సూచనతో తిరిగి మధుసూదన్ రెడ్డిని చైర్మన్ గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.... ప్రభుత్వ పెద్దల సహకారంతో సంస్థ అభివృద్ధి కి చర్యలు తీసుకుంటా మన్నారు. ముఖ్యంగా ఎన్డీడీబీతో ఒప్పందం చేసుకోవడం ద్వారా సమస్య ను అధిగమిస్తామన్నారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు ఇంచార్జి ఎండిగా కొనసాగిన బి.కృష్ణ బాధ్యతల నుండి తప్పుకున్నారు. ఆయన స్థానంలో అకౌంట్స్ ఆఫిసర్ గఫార్ ని ఇంచార్జి ఎండీ గా నియమించారు.

మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగం

తుర్కయంజల్ జనవరి 28, ప్రభాతవార్త
తుర్కయంజాల్ డివిజన్ ఆదిభట్ల సర్కిల్, సాగర్ రోడ్డు రాగన్నగూడ సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీ రేణుక రాజరాజేశ్వరి పీఠం శ్రీ విశ్వవాసు నామ సంవత్సర మాగ శుద్ధ దశమి బుధవారం, శు" పూర్ణిమ ఆదివారం వరకు మెళ్లూరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో, పంచాహనిక దీక్ష, ఏకోత్తర వృద్ధిగా, సహస్ర చండీయాగంలో భాగంగా విగ్నేశ్వర పూజ, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వామి, అర్చన జరిగాయి. మహారుద్ర సహిత సహస్ర చండి మహాయాగ సమాహ్వానము శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థానం పీఠాధిశ్వరులు జగద్గురు, శ్రీశ్రీశ్రీ మదబినవొద్దండ విద్యా శంకర భారతి మహాస్వామి వారి ఆశీర్వానుగ్రహములతో, వేదమూర్తులు అభివనశుక పురాణ వాచస్పతి బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ, జగన్మాత సేవలో, ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రవచనాలు చెప్పడం జరిగింది. ఈ యాగంలో పాల్గొన్న వారికి దివ్య అనుగ్రహం లభిస్తుందని, దేవి శక్తి ద్వారా, ఆర్థిక స్థిరత్వం, గ్రహదోషాలు, శత్రుబాధలు, కర్మ బంధాలు తొలుగుతాయని, రుద్ర హోమం ద్వారా మనస్సు శుద్ధి అవుతుందని, అమ్మవారి కృపా కటాక్షాలను పొందుతారని, భూమి నీరు అగ్ని వాయువు ఆకాశం శుద్ధి అవుతుందని, వర్షాలు పడటం వలన పంటలు బాగా పండటం, ప్రకృతి విపత్తుల నివారణ వంటివి జరుగుతాయని తెలియజేశారు. భక్తులం దరికీ ప్రతిరోజు అమ్మ సన్నిధిలో అన్న ప్రసాదం వితరణ కలదు కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

డ్రైనేజీ నిర్మాణపు పనులకు శంఖుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రాగుల.

వనస్థలిపురం. జనవరి. 28. ప్రభాతవార్త
వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఇంజనీర్స్ కాలనీ (ఫేజ్-2)లో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవనీయులైన కార్పొరేటర్ శ్రీ రాగుల వెంకటేశ్వర రెడ్డి హాజరై శంకు స్థాపన నిర్వహించారు. ఈ కార